# జీవితాల్లో పాలు పోస్తున్నారు..!

సామాన్య, మధ్య తరగతికి పశు పోషణే జీవన ఆధారం

జిల్లాలో నిత్యం 20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి



న్యూస్‌టుడే, శాంతిపురం

రెండున్నర దశాబ్దాల కిందట గ్రామాల్లో దేశవాళీ ఆవులు మాత్రమే కనిపించేవి. ఇతర జాతి ఆవులు అక్కడక్కడ మాత్రమే ఉండేవి. అర లీటరు పాలు కొనాలంటే పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఆరుతడి పంటల సాగుకు అనువైన నేలలు, పశు పోషణకు అనుకూల వాతావరణం ఉండటంతో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని 20 ఏళ్ల కిందటే సీఎం నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారు. రైతు కుటుంబాలతోపాటు వ్యవసాయ కూలీల ఇళ్లలోనూ క్షీర విప్లవాన్ని తీసుకురావాలన్న ఆశయంతో ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు.



### పశ్చిమ నియోజకవర్గాల్లో ప్రాధాన్యం

పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పశుపోషణ చేపడుతున్నారు. ఐదెకరాల నుంచి అర ఎకరం పొలం కలిగిన రైతులు సైతం ఇటు వైపు మొగ్గు చూపుతున్నారు. పంటలకు గిట్టుబాటు లేని పరిస్థితుల్లో పాడితో చక్కటి ఆదాయాన్ని సాకారం చేసుకుంటున్నారు. విద్యావంతులైన నిరుద్యోగులు, యువత, మహిళలు పశు పోషణను జీవనోపాధిగా మలుచుకున్నారు.

### చంద్రబాబు మాటలు నిజమైన వేళ

కుప్పంలో వర్షాభావం, నీటి ఎద్దడి ప్రభావంతో వ్యవసాయంలో నష్టపోతున్న రైతులు ప్రత్యామ్నాయ మార్గంగా పశుపోషణ చేపట్టాలని 1989లో స్థానిక ఎమ్మెల్యేగా చంద్రబాబునాయుడు చెప్పిన మాటలను అప్పట్లో రైతులు పెద్దగా పట్టించుకోలేదు. స్థానికంగా పాలసేకరణ డెయిరీలు ఏర్పాటు చేయిస్తానని.. ప్రతి ఇంటా పాడి ఆవులు ఉండే విధంగా కృషి చేస్తానని ఆయన ఇచ్చిన హామీలను కొందరు నమ్మలేదు. 1994లో తెదేపా అధికారాన్ని చేపట్టడం, చంద్రబాబు ఆర్థిక, రెవెన్యూశాఖ మంత్రి, వెనువెంటనే సీఎం కావడంతో కుప్పంలో పాడి పరిశ్రమకు బీజం పడింది. ప్రభుత్వం అందించిన రాయితీలు సద్వినియోగం కుప్పం వాసులు చంద్రబాబు చెప్పిన మాటలు అక్షరాలా నిజం చేశారు. నాలుగు మండలాల్లో 70 వేల కుటుంబాలు ఉండగా.. 60 శాతం కుటుంబాలు రోజుకు దాదాపు ఆరు లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తున్నారు.

### జిల్లా గణాంకాలు

- పాడి రైతులు: 2.52 లక్షల మంది
- పాడి ఆవులు: 5.46 లక్షలు
- రోజుకు సగటు ఉత్పత్తి: 20 లక్షల లీటర్లు
- పాల సేకరణ డెయిరీలు: 12

### ఓ గ్రామం నుంచే 2 వేల లీటర్లు

శాంతిపురం మండలం సొన్నేగానిపల్లె పంచాయతీ గుండిశెట్టిపల్లెలో 200 కుటుంబాలు ఉన్నాయి. వందశాతం పాడిపోషణే ఆధారం. సగటున ప్రతి ఇంటికి నాలుగు ఆవులు పోషిస్తున్నారు. రోజూ 2 వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నారు.



### ఎమ్మెస్సీ చదివి.. 15 ఆవులతో డెయిరీ

మాది శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె. ఎమ్మెస్సీ పూర్తి చేసి స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో టీచరుగా పని చేస్తున్నా. పొలం వద్ద పశుపోషణ షెడ్డు ఏర్పాటు చేసుకొని 15 ఆవులు పోషిస్తున్నా. రోజుకు 150 లీటర్ల పాలు విక్రయిస్తున్నా. ఇద్దరు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నా. నెలకు రూ.80 వేల వరకు ఆదాయం లభిస్తోంది.

**- సంపత్, యువ రైతు**



### నెలకు రూ.లక్ష ఆదాయం

మాది వ్యవసాయ కుటుంబం. ఎంఏ చదువుకున్నా. పంటల సాగులో గిట్టుబాటు లేక పాడి పరిశ్రమపై దృష్టి సారించా. ఐదేళ్లుగా పశుపోషణలో ఉన్నా. రెండెకరాల్లో గడ్డి సాగు చేసి 20 పాడి ఆవులు పోషిస్తున్నా. అందుబాటులోనే పాల డెయిరీ ఉండటం కలిసొచ్చింది. ఖర్చులు పోనూ నెలకు రూ.లక్ష ఆదాయం వస్తోంది.

**– ప్రకాష్‌రెడ్డి, గుండిశెట్టిపల్లె**

---

### సర్వదర్శనానికి 12 గంటలు

**తిరుమల:** ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా శుక్రవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 58,637 మంది దర్శించుకున్నారు. రూ. 3.69 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.

---

## గార్గేయ ఉద్ధృతికి కొట్టుకుపోయిన వంతెనలు



పెద్దఉప్పరపల్లె-రెడ్డివారిపల్లె మార్గంలో నీటిలోనే వెళ్తున్న గ్రామస్థులు

పెద్దఉప్పరపల్లె - చిన్నకమ్మపల్లె మార్గంలో తెగిపోయిన తాత్కాలిక దారి



**సోమల, న్యూస్‌టుడే:** వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు సోమల మండలంలోని గార్గేయ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలో మూడు చోట్ల పైపుల వంతెనలు కొట్టుకుపోయాయి. 8 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దఉప్పరపల్లె ప్రాంతంలో కుండ పోత కురవడంతో పెద్దఉప్పరపల్లె- బసవపల్లె మార్గం, పెద్దఉప్పరపల్లె- చిన్నకమ్మపల్లె, పెద్దఉప్పరపల్లె- రెడ్డివారిపల్లె మార్గాల్లో ఏర్పాటు చేసిన పైపుల వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో రెడ్డివారిపల్లె, చిన్నకమ్మపల్లె, ఎస్సీకాలనీ, బోనమంద, బసవపల్లె, పేటూరు, ఇర్లపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పేటూరు చెరువు మొరవ ఉద్ధృతి పెరగడంతో రాకపోకలు నిలిచాయి. పెద్దఉప్పరపల్లె- చౌడేపల్లె మార్గంలో సీతమ్మచెరువు వంక పొంగింది. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఈ విషయాన్ని పీఆర్ ఎస్‌ఈ ఎస్‌ఈ చంద్రశేఖరనాయక్‌కి తెలిపారు. ఆయన ఈఈలు చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజ, డీఈ కరుణాకర్, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణతో కలిసి పరిశీలించారు.



పెద్దఉప్పరపల్లె - బసవపల్లె మార్గాన్ని పరిశీలిస్తున్న పీఆర్ అధికారులు, తెదేపా నాయకులు



### కురిసిన వర్షం... వరి పంటనష్టం

**బంగారుపాళ్యం:** వర్షానికి మండలంలోని మొగిలి, మొగిలివారిపల్లె, గోరేశంకరపురం, కొత్తపల్లె గ్రామాల్లో కోతకు వచ్చిన వరిపంట దెబ్బతింది. కంకులు నీటిలో మునగడంతో మొలకలు వచ్చి పాడవుతున్నాయని రైతులు చంద్రశేఖర్, సుబ్రమణ్యం వాపోయారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

---

# గ్రామీణ దారులకు మోక్షం

### 154 కి.మీ. రహదారుల బాగు



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో చేస్తున్న పనులు

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్లను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు పనుల్లో కదలిక మొదలైంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మూడేళ్ల కిందట నిలిచిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రోడ్లను బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది.

జిల్లాల్లో బాగా రద్దీగా ఉన్న ఏక వరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరించేందుకు 2019లో ఎన్‌డీబీ ముందుకొచ్చింది. ఈ పనులకు ఎన్‌డీబీ 70 శాతం నిధులు రుణంగా ఇస్తుంది. మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడంతో పలుచోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే గుత్తేదారులు వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం వాటా ఇచ్చేందుకు సుముఖత తెలపడంతో ఎన్‌డీబీ సానుకూలంగా స్పందించింది.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకు రెండు వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించే (పీసీయూ) రహదారులను గుర్తించి, వాటిని రెండు వరుసలుగా విస్తరించేలా గత తెదేపా హయాంలో నిర్ణయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు వేల పీసీయూ పైగా ఉండే 92.97 కి.మీ. రహదారులను గుర్తించారు. వీటి విస్తరణకు ఎన్‌డీబీ నిధులు మంజూరు చేసింది. అంతలోనే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగా.. రోడ్ల బాగుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 30 శాతం వాటా చెల్లించకపోవడంతో పనులు పడకేశాయి.

### ఇవీ రోడ్లు


- దేవదొడ్డి-లక్కన్నపల్లి రోడ్డు వయా తీర్థం 9.05 కి.మీ.
- సీపీ రోడ్డు-పూతలపట్టు-రామాపురం వయా కొండేపల్లి 5.92కి.మీ.
- పూతలపట్టు-ఐరాల వయా కొండేపల్లి 3.42 కి.మీ.

---

# విద్యాంజలి పేరిట వల!

- డీఈవో ఆదేశాలు లేకుండానే పాఠశాలల్లో విధులు?
- విశాఖపట్నానికి చెందిన ఓ బ్యాంకు చెక్కులతో కుచ్చుటోపీ
- కేంద్ర పథకాన్ని చూపి ఘరానా మోసం

**కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే:** వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఆయా పాఠశాలలకు అవసరమైన వసతులు, సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విద్యాంజలి 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా చేసుకుని ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టారు. డీఈవో కార్యాలయం నుంచి పాఠశాలలకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోయినా ఓ క్లర్క్ పేరుతో హెచ్ఎంలకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడి నకిలీ ఉద్యోగ నియామకపత్రాలతో విధుల్లోకి చేర్చారు. నెలలు తరబడి పనిచేసినా జీతాలు అందకపోవడంతో అవి నకిలీ ఉద్యోగాలని తేలడంతో ఎట్టకేలకు విద్యాశాఖ అధికారులు వారిని విధుల నుంచి తప్పించారు. ఈ మోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. విద్యాంజలి పథకాన్ని వినియోగించుకుని కొన్ని ప్రముఖ సంస్థల పేర్లతో నియమాకాలు జరిగినట్లు సమాచారం. జిల్లాలో గుజరాత్ వ్యాపారి పేరుతో స్థాపించిన ఓ సంస్థ, ఓ హెల్త్ కేర్ సంస్థ పేరిట ఉత్తర్వులు ఇచ్చారు. అందులో నెల జీతంతో పాటు సంవత్సరాదాయం సైతం తెలిపారు.



నియామక పత్రం

### ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు వసూలు

ఒక్కో ఉద్యోగానికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు దళారులు వసూలు చేశారు. నెలల తరబడి పనిచేసినా వారికి జీతాలు అందలేదని, వేతనం లేదా ఇచ్చిన నగదు తిరిగివ్వాలని కుప్పం, చిత్తూరుకు చెందిన దళారులపై బాధితులు ఒత్తిడి చేశారు. కొందరికి విశాఖపట్నానికి చెందిన ఓ బ్యాంకు ఖాతాకు చెందిన చెక్కులిచ్చారు. అందులో నగదు లేకపోవడంతో వారు వెనుదిరిగారు. గత ప్రభుత్వంలో ఓ మంత్రి వద్ద పనిచేసిన ఉద్యోగి ఈ అక్రమంలో కీలకంగా ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

### డీఈవో కార్యాలయంలో ఎవరా క్లర్కు..?

స్వచ్ఛంద సంస్థల నియామకపత్రాలతో నిరుద్యోగులు జడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లడంతో ప్రధానోపాధ్యాయులు అవాక్కయ్యారు. ప్రభుత్వం పాఠశాలలకు సంబంధించి ఎలాంటి పోస్టులను భర్తీచేయకపోయినా.. రికార్డు అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఎక్కడివని వారి వెనక్కు పంపే ప్రయత్నం చేయగా... డీఈఓ కార్యాలయం నుంచి క్లర్కు మాట్లాడుతున్నానని.. విధుల్లో వారిని చేర్చుకోవాలని మౌఖిక ఆదేశాలు అందాయి. విధిలేక వారిని చేర్చుకోని సర్వీసు, హాజరు పట్టికలను సైతం వారు అందించారు. అయితే ప్రస్తుతం ఆ ఉద్యోగాలు నకిలీవని తేలడంతో హెచ్ఎంలు తలలు పట్టుకుంటున్నారు. వారిని విచారిస్తే మోసంలో విద్యాశాఖలో కీలకంగా వ్యవహరించిన క్లర్క్ వివరాలు వెలుగులోకి వస్తాయి. ఆ దిశగా విచారించాలని బాధితులు కోరుతున్నారు.

### ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేక..

2022 నుంచి రెండేళ్ల పాటు జరిగిన ఈ వ్యవహారంపై వైకాపా హయాంలో అప్పటి చిత్తూరు డీఈఓతోపాటు అప్పటి కలెక్టర్, ఎస్పీలకు సైతం బాధితులు ఫిర్యాదు చేశారు. వైకాపా ప్రభుత్వంలో కీలక వ్యక్తి హస్తం ఉండటంతో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టడానికి ఎవరూ సాహసించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కనీసం ఫిర్యాదు తీసుకోలేదని వాపోతున్నారు. దీన్నిబట్టి ఈ కుంభకోణం ఏ స్థాయిలో జరిగిందో ఇట్టే అర్థమవుతోందని పెదవి విరుస్తున్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బాధితులు రెండుదఫాలు చిత్తూరు కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. అవి పోలీసు శాఖకు వెళ్లినా.. బాధితులకు న్యాయం జరగలేదు. అన్ని జిల్లాల్లో బాధితులు ఉన్నారని, ప్రభుత్వం సీఐడీ వంటి సంస్థలతో విచారణ చేయిస్తే ఫలితం ఉంటుందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు.

---

# నిరీక్షణ.. నిరాశ

- ఐదేళ్లుగా భర్తీగాని ఏఈ పోస్టులు
- గత ప్రభుత్వ నిర్వాకంతో సేవలకు విఘాతం
- పనిభారంతో సిబ్బంది అవస్థలు
- కూటమి ప్రభుత్వంపై చిగురిస్తున్న ఆశలు



**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకారం ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను ఏటా భర్తీ చేస్తామన్న వైకాపా ప్రభుత్వం చివరకు నిరుద్యోగులను దగా చేసింది.. విద్యుత్తుశాఖను అస్తవ్యస్తంగా మార్చేసి పాలనా వ్యవహారాలను కొందరు ప్రజాప్రతినిధులు సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.. వేలాది సంఖ్యలో భర్తీ కాని సర్కారు కొలువులతో యంత్రాంగంపై పనిభారం, ఒత్తిడి కారణంగా సత్వర సేవలు, అభివృద్ధి పనులకు విఘాతం ఏర్పడింది.. గత ఐదేళ్లలో రాష్ట్రంలోని విద్యుత్తు శాఖలో కీలకంగా ఉన్న ఖాళీలు భర్తీ కాని దుస్థితి.. దీంతో జిల్లాలోని చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ డివిజన్లలో ఏఈల కొరత తీవ్రంగా వేధిస్తోంది.. ఎస్పీడీసీఎల్‌లో రెగ్యులర్ ఏఈల నియామకాలు చేపట్టకపోవడంతో ప్రత్యామ్నాయంగా సబ్ ఇంజినీర్లు, సమీపంలోని ఏఈలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖలో ఏఈల పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతుందనే ఆశతో నిరుద్యోగులు, వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

### పని ఒత్తిళ్లతో అవస్థలు..

విద్యుత్తు శాఖలో ఏళ్ల తరబడి ఏఈలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది పోస్టులు భర్తీకి నోచుకోలేదు. దీంతో అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా ప్రస్తుతం ఉన్న వారినే పలుచోట్ల ఇన్‌ఛార్జిలుగా నియమించి కాలయాపన చేస్తున్నారు. తద్వారా అధిక పనిభారంతో అధికారులు, సిబ్బంది నిత్యం ఇబ్బంది పడుతున్నారు. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక గుంభనంగా ఉన్నారు.

### ఖాళీగా ఏఈ పోస్టులు..

చిత్తూరు అర్బన్ డివిజన్‌లో ఆవులకొండ(గంగాధర నెల్లూరు మండలం), పెనుమూరు, గుడిపాల, పాలసముద్రం. చిత్తూరు రూరల్ డివిజన్‌లో బంగారుపాళ్యం, పైపల్లి, ఐరాల మండలాల ఏఈ పోస్టులతో పాటు.. పైపల్లె డీఈఈ పోస్టు భర్తీకి నోచుకోలేదు.

### క్షేత్రస్థాయి పోస్టులన్నీ ఖాళీనే..

విద్యుత్తు వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కారానికి క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలి. ఈ శాఖలో క్షేత్రస్థాయిలో కీలకమైన ఏఎల్ఎం(అసిస్టెంట్ లైన్‌మెన్), జేఎల్ఎం(జూనియర్ లైన్ మ్యాన్), పోస్టులు 70-80 శాతం మేరకు కొన్నేళ్లుగా భర్తీకి నోచుకోలేదు. సిబ్బంది కొరతతో సమస్యల పరిష్కారంలో జాప్యం సహా అవే సమస్యలు పునరావృతమవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

### జాబ్ క్యాలెండర్‌లో విద్యుత్తు శాఖ..

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాబ్ క్యాలెండర్ పేరుతో శాఖల వారీగా ఏటా పోస్టుల భర్తీ చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించింది. ఈ క్యాలెండర్‌లో విద్యుత్తు శాఖను చేర్చడం ఎంతో శుభపరిణామమని ఆ శాఖ అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు.

**సర్వీసుల వివరాలిలా..**

- చిత్తూరు అర్బన్ డివిజన్: 1.80 లక్షలు
- చిత్తూరు రూరల్ డివిజన్: 85 వేలు

---

# ఏకోపాధ్యాయులకు విముక్తి

- వైకాపా నిర్ణయంతో సర్కారు బడులు కళావిహీనం
- పేదలకు విద్యనందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

ఈనాడు డిజిటల్ తిరుపతి, న్యూస్‌టుడే, చిత్తూరు విద్య



కొత్తూరు దళితవాడ ఏకోపాధ్యాయ పాఠశాలలో నలుగురు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు, పక్కన ఎంఈవో (పాత చిత్రం)

- యాదమరి మండలం లగడపాటూరు, చిత్తూరు గ్రామీణ మండలం తిమ్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఒక విద్యార్థే ఉన్నారు. బోధనకు ఉపాధ్యాయుడు ఒక్కడే ఉన్నారు.
- పూతలపట్టు మండలం కొత్తూరు దళితవాడ, బైటపల్లె ప్రాథమిక పాఠశాలల్లో నలుగురు చొప్పున విద్యార్థులున్నారు. ఈ మండలంలో పది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 16. అందులో నలుగురు విద్యార్థులున్న పాఠశాలలు రెండే. మిగిలిన 14 పాఠశాలల్లో ఐదుగురు, ఏడుగురు, ఎనిమిది, పది మంది చదువుతున్నారు.

1, 2, 4, 7, 10.. ఇవన్నీ క్రికెటర్ల స్కోరు అనుకునేరు.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య.. కొన్నిచోట్ల పిల్లలు లేక అక్కడి ఉపాధ్యాయులను అదే మండలంలో మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు.. మనబడి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గత ప్రభుత్వ పాలకులు చెప్పిన కాకి లెక్కలకు ప్రస్తుత పరిస్థితి ఇదీ.. వైకాపా పాలనలో తెచ్చిన జీవో 117 అమలు చేసి 3, 4, 5 తరగతుల విలీనంతో ఆ ప్రభావం ప్రాథమిక పాఠశాలలపై పడింది.. దీంతో ఆ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను వేరేచోట లేక ప్రైవేటు పాఠశాలలకు పంపడంపై అక్కడి ఉపాధ్యాయులు అవగాహన కల్పించినా వారు వినలేదు.. నాటి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

### అడ్డగోలుగా తగ్గుదల..

వైకాపా హయాంలో తెచ్చిన జీవో 117 అమలుతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. జాతీయ నూతన విద్యావిధానం-2020 పేరుతో 117 జీవో అమలు చేసి 98 మంది కంటే విద్యార్థులు తక్కువ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను, కిలోమీటరు దూరంలో ఉన్న హైస్కూళ్లలో విలీనం చేశారు. మరోపక్క హేతుబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 1,946 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో, కేవలం ఒక్క ఉపాధ్యాయుడే 1-5 తరగతుల్లో అన్ని పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే జీవో 117 రద్దుకు చర్యలు తీసుకోనుంది.

### మంత్రి లోకేశ్ హామీతో

విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉండటం, మౌలిక వసతులు.. బోధన తదితర వివరాలు తెలుసుకునేందుకు పూతలపట్టు మండలం ఆకణాంబట్టు జడ్పీ ఉన్నత పాఠశాలను ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంత్రి ఇటీవల చర్చించగా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం జీవో 117అని తేలింది. దీన్ని రద్దు చేస్తే ప్రభుత్వ పాఠశాలలకు గత వైభవం వస్తుందని అందరూ మంత్రి దృష్టికి తీసుకురావడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీన్ని తప్పక రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో..

- ప్రాథమిక పాఠశాలలు: 3,676
- విద్యార్థులు: 1,02,556
- ఏకోపాధ్యాయ పాఠశాలలు: 1,946
- విద్యార్థులు: 28,012
- పదిమందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు: 356 (చిత్తూరు జిల్లా), 292 (తిరుపతి జిల్లా)

---

# అధినేత సమావేశానికి జిల్లా ఎమ్మెల్యేలు



సమావేశంలో జిల్లాలో ఎమ్మెల్యేలు

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. చంద్రగిరి, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్, గాలి భానుప్రకాష్, కలికిరి మురళీమోహన్ హాజరయ్యారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సీఎంకు వివరించారు. ఆపై అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని అధినేతకు విన్నవించారు.

---

### టెట్‌కు 249 మంది హాజరు

**చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** టెట్‌కు శుక్రవారం 249మంది అభ్యర్థులు హాజరయ్యారు. 304 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 55మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాలలో 100మందికి.. 81మంది, పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాలలో 130మందికిగాను 119మంది చెన్నై ప్రగ్య టెక్నాలజీ కేంద్రంలో 74మందికి గాను 49మంది హాజరయ్యారు.

### 31 వరకు గడువు

సార్వత్రిక పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఈ నెల 31వరకు అపరాధ రుసుంతో ప్రవేశం పొందవచ్చని డీఈవో దేవరాజు, సార్వత్రిక పాఠశాల జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించి ఈ నెల 25 లోగా అప్‌లోడ్ చేయాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 29వరకు, రూ.500 అపరాధ రుసుంతో 31వరకు గడువు ఉందని చెప్పారు.

## నవంబరు 28 నుంచి శ్రీపద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు


పద్మసరోవరాన్ని పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ తదితరులు

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి ప్రారంభం కానున్నట్లు తిరుపతి జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో కలిసి పద్మసరోవరం, పార్కింగ్ ఏరియా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బ్రహ్మోత్సవాలను తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తితిదే సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, సెల్వం, శివప్రసాద్, వీజీవో సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జలాశయం వద్ద సినిమా చిత్రీకరణ


జలాశయం వద్ద సినిమా చిత్రీకరణ దృశ్యం

**పెనుమూరు:** ఎన్టీఆర్ జలాశయం వద్ద శుక్రవారం తమిళ సినిమా చిత్రీకరణ సందడి నెలకొంది. దర్శకుడు నవీన్ నేతృత్వంలో ఉసురు చిత్రం రూపుదిద్దుకుంటోంది. కథానాయకుడిగా అరుణాచలం, కథానాయికగా జనని నటిస్తున్నారు. ఇది ప్రేమకథా చిత్రమని దర్శకుడు తెలిపారు. జలాశయం వద్ద సినిమా చిత్రీకరణ జరుగుతున్న విషయం పరిసర గ్రామాల ప్రజలకు తెలియడంతో అక్కడకు వచ్చి తిలకించారు.

## తమిళశాఖకు బడ్జెట్ కేటాయించాలని వినతి


మురుగానందంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ దొరస్వామి, రాష్ట్ర మాజీ సీఎస్ చల్లప్ప

**కుప్పం గ్రామీణ:** ద్రవిడ విశ్వవిద్యాలయంలోని తమిళశాఖకు బడ్జెట్ కేటాయించాలని కోరుతూ శుక్రవారం వర్సిటీ వీసీ ఆచార్య దొరస్వామి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందంకు వినతిపత్రాన్ని అందించారు. వర్సిటీలోని తమిళశాఖ అధ్యాపకుల జీతాలతోపాటు విద్యార్థుల ఉపకార వేతనాలకు గతంలో తమిళ ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేసేదని వివరించారు. గత ఐదేళ్లుగా నిధులు విడుదల కాకపోవడం పట్ల ఎదుర్కొంటున్న సమస్యలు ఆయనకు తెలిపారు. రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి చల్లప్ప, వర్సిటీ పీఆర్‌ఓ గణేష్‌మూర్తి ఉన్నారు.

**వెంకాబ్ కోళ్ల ధరలు**

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 129 |
| రిటైల్ | 151 |
| లేయర్ | 120 |
| బ్రాయిలర్స్ | 219 |
| బ్రాయిలర్స్ స్కిన్ లెస్ | 249 |
| లేయర్ మాంసం | 204 |

## చిన్నారులు.. చిచ్చర పిడుగులు

### రాష్ట్ర, జిల్లా స్థాయిలో సత్తా

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** చిన్నారులు చదువుతో పాటు సహ పాఠ్యాంశాలు, కళల్లో చక్కటి ప్రతిభతో రాణిస్తున్నారు. పాఠశాల దశలోనే పోటీతత్వాన్ని అలవరచుకుని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తున్నారు. కళల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శనలిస్తూ ఔరా అనిపిస్తున్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించి సినీ రంగంలో స్థిరపడతామని చిన్నారులు అభిప్రాయపడుతున్నారు.

### చరణ్ స్వరం.. జానపదం



బైరెడ్డిపల్లె మండలం రామాపురానికి చెందిన సోమశేఖర్, గాయత్రి దంపతులు కుమారుడు చరణ్. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్ల ప్రాయంలోనే డ్యాన్స్‌పై ఆసక్తి పెంచుకుని సాధన చేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్థానిక కళాతరంగిణి సంస్థలో ఏడాది సంగీత, నృత్య శిక్షణ తీసుకున్నాడు. జానపద నృత్యాలంటే ప్రాణం. జానపద నృత్య ప్రదర్శనలు చేయడంలో చక్కటి నైపుణ్యాన్ని అలవరచుకుని బహుమతులు సాధించాడు. తిరుపతి, పుట్టపర్తి, కడప శిల్పారామాల్లో 10కి పైగా ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకున్నాడు. టీవీ షోల్లో ప్రదర్శనలు చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారు.

### ప్రసంగాల్లో దిట్ట.. ఈ బుడతడు


ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రశంసలు అందుకున్న విద్యార్థి గగన్

గంగినాయనిపల్లె ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి విద్యార్థి గగన్ వక్తృత్వ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపుతున్నాడు. వేదికలపై జంకూ లేకుండా అనర్గళంగా ప్రసంగిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. అంశం ఏదైనా తడబాటు లేకుండా ప్రసంగిస్తూ బహుమతులు సాధిస్తున్నాడు. బైరెడ్డిపల్లెలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ సన్మాన కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్ర గురించి సుదీర్ఘ ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నాడు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు.

### కళల్లో గగన్ ప్రతిభ



జంబుగుండ్లపల్లెకు చెందిన గౌరమ్మ, కిట్టన్న దంపతుల కుమారుడు గగన్. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు కళలపై ఆసక్తిని పెంచుకుని రెండేళ్ల పాటు సంగీత, నృత్య శిక్షణ తీసుకున్నాడు. పాటలు పాడటం, నృత్య ప్రదర్శన చేయడంలో నైపుణ్యాన్ని సాధించాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే నృత్య పోటీల్లో పాల్గొని పలు బహుమతులు అందుకున్నాడు. అన్ని శిల్పారామాల్లో జానపద, సినీ నృత్య ప్రదర్శనలు చేసి 20కి పైగా బహుమతులు సాధించాడు. నటుడిగా స్థిరపడాలన్నదే గగన్ అభిలాష.

## అవివాహితులకు సువర్ణావకాశం

### నేడు, రేపు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత రిజిస్ట్రేషన్



విశ్వబ్రాహ్మణ కుల అవివాహితులకు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని 'ఈనాడు' కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరిలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న సంబంధిత కుటుంబీకులు శనివారం, ఆదివారం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 91547 72006, 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3.30 లక్షలు


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న నాగేశ్వర్‌రావు, లావణ్య

**జీడీనెల్లూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని ఎట్టేరి శ్రీభానోదయ ఆంగ్ల మాధ్యమ విద్యాసంస్థల వ్యవస్థాపకులు నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ లావణ్య దంపతులు సీఎం సహాయనిధికి రూ.3.30 లక్షల నగదు చెక్కును గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఆపై మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందించడంతోపాటు పేద పిల్లలకు రాయితీ ఫీజుతో విద్యాబోధన చేయాలని వారు సూచించినట్లు నాగేశ్వర్‌రావు, లావణ్య వివరించారు.

## త్వరలో అన్నదాతకు రాయితీ పరికరాలు

### ఏడు రకాల అందజేతకు ప్రతిపాదనలు

**చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే:** కర్షకులకు రాయితీపై యంత్ర పరికరాలు అందజేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ జిల్లాకు ఎలాంటి సాగు పరికరాలు అవసరమవుతాయో పరిశీలించి 7-10రకాల పరికరాలు సరఫరా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. త్వరలో వీటిని రాయితీపై అందజేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సాగుకు అవసరమయ్యే యంత్ర పరికరాలు అందుబాటులో లేక ప్రభుత్వం రాయితీపై అందించక జిల్లాలో రైతులు అయిదేళ్ల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలోనూ తెదేపా ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే యంత్ర పరికరాలను రాయితీపై సమకూర్చింది. ఈ విధానానికి వైకాపా ప్రభుత్వం మంగళం పాడింది. ఆర్బీకేల పరిధిలో గ్రూపులు ఏర్పాటైన వారికి మాత్రమే వీటిని అందజేసి యాంత్రీకరణ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. వ్యక్తిగతంగా రైతులకు రాయితీపై వీటి పంపిణీ విధానానికి స్వస్తి పలికింది. తద్వారా మార్కెట్లో పరికరాలు కొనుగోలు చేయలేక బాడుగ చెల్లించలేక రైతులు ఇబ్బంది పడ్డారు.

### 78,350 టార్పాలిన్ పట్టలకు ప్రతిపాదనలు

జిల్లాకు రాయితీపై 79,350 టార్పాలిన్ పట్టల సరఫరాకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. మండలాల వారీగా అవసరాలకు అనుగుణంగా నివేదించారు. అవి రాగానే రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు.

## సఫాయి కర్మచారులకు కనీస వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్

**చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సఫాయి కర్మచారులకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కనీస వేతనాలు అందించాలని సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ ఆదేశించారు. సఫాయి కర్మచారులపై సమస్యలపై కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చిత్తూరులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు జీతభత్యాల చెల్లింపులో వ్యత్యాసం ఉంది. నిబంధనల మేరకు వేతనాలు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల్ని సక్రమంగా అమలు చేయాలి. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంపై అవగాహన కల్పించాలి. బ్యాంకుల ద్వారా పూచీకత్తు లేని రుణ సౌకర్యం కల్పించాలి. ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న కార్మికులకు సమవస్త్రాలు, చెప్పులు అందించాలి. ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ప్రతి మూడు నెలలకోసారి వైద్య శిబిరాల్ని ఏర్పాటుచేయాలని' పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, జీతభత్యాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టామన్నారు. పని ప్రదేశంలో ఎదురవుతున్న సమస్యల్ని మహిళా కార్మికులు ప్రస్తావించారు. దీనిపై కలెక్టర్ స్పందించి.. సమస్యల పరిష్కారానికి మహిళా అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రాజ్యలక్ష్మీ, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, గృహనిర్మాణ సంస్థ పీడీ పద్మనాభం, ఎల్డీఎం హరీష్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, చిత్తూరు కమిషనర్ నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

### నవంబర్ 10 నుంచి కడపలో

## అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్ ర్యాలీ

**చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** నవంబర్ 10 నుంచి 15 వరకు కడప డీఎస్ఏ స్టేడియంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూటింగ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్(గుంటూరు) డైరెక్టర్ పునీత్ కుమార్ శుక్రవారం తెలిపారు. జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, 10 ట్రేడ్స్‌మెన్, 8 ట్రేడ్స్‌మెన్ పోస్టుల ఎంపికకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. దరఖాస్తు నమోదుకు అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

## అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా జగదీశన్

**చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే:** జిల్లాలోని నగరిలో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా ఎం.జె.జగదీశన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్వర్వులో పేర్కొంది.

## ఐరాలలో 58.2 మి.మీటర్ల వర్షపాతం

**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి జిల్లాలోని 28 మండలాల్లో భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఐరాల మండలంలో 58.2 మి.మీటర్లు కురవగా.. అత్యల్పంగా చిత్తూరులో 2.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. బంగారుపాళ్యం 20.4 మి.మీటర్లు, చౌడేపల్లె 18.6, పాలసముద్రం 17.2, పెనుమూరు 16.8, సదుం 16.6, సోమల 14.6, చిత్తూరు రూరల్ 11.8, కార్వేటినగరం, గంగవరం 10.6, వెదురుకుప్పం 10.2 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం చిత్తూరు, పరిసర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

## సంకెళ్లేసి.. జరిమానా వసూలు చేసి



ఎక్కడైనా దొంగలకు సంకెళ్లు వేయటం చూసి ఉంటాం. కానీ ద్విచక్ర వాహనాలకు పోలీసులు సంకెళ్లు వేయటం విచిత్రమే. చిత్తూరు నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ వెలుపల ఉన్న ద్విచక్ర వాహనాలకు సంకెళ్లు వేసి ఉండటాన్ని స్థానికులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఈ స్టేషన్ ముందే ఉన్న బస్టాప్ నుంచి పీలేరు, బెంగళూరు, వేలూరు, చెన్నై, మదనపల్లె, అనంతపురం తదితర ప్రాంతాలకు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో కొందరు ద్విచక్ర వాహనదారులు, ఉద్యోగులు స్టేషన్ ముందు వాహనాలు ఆపి ఉంచడంతో రోజువారీ కొన్నింటికి ఇలా సంకెళ్లు వేయటంతో వాహనం తీసుకెళ్లేందుకు వచ్చిన చోదకులు పోలీసులను సంప్రదిస్తున్నారు. దీంతో జరిమానా విధించి పంపుతున్నారు. **- ఈనాడు, చిత్తూరు**


ఎంపికైన జేఎన్‌టీయూఏ జట్లు

## జేఎన్‌టీయూ(ఏ) తైక్వాండో జట్ల ఎంపిక

**చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ(ఏ) తైక్వాండో జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీల్ని నిర్వహించి మహిళల విభాగంలో ముగ్గురు, పురుషుల విభాగంలో ఏడుగురిని తుది జట్లకు ఖరారు చేశారు. ఎంపికైన ఆటగాళ్లు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో డిసెంబర్‌లో జరగనున్న అఖిల భారత భారత అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో తలపడనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, జేఎన్‌టీయూ(ఏ) క్రీడల బోర్డు కార్యదర్శి జీబీరెడ్డి తెలిపారు. మనోహర్‌నాయుడు, లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్క్రీనింగ్ కార్యక్రమానికి స్పందన

**చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే:** చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం దీన్‌దయాళ్ శ్రావణ్ ఫౌండేషన్ ద్వారా వినికిడి లోపం ఉన్న వారికి జరిగిన స్క్రీనింగ్ క్యాంపు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. చిత్తూరు పరిసర మండలాల నుంచి వినికిడి సమస్య ఉన్న 36 మంది పిల్లలు, 42 మంది పెద్దలు ఆస్పత్రికి రాగా.. వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సమస్య తీవ్రంగా ఉన్న వారిని వైద్యాధికారులు గుర్తించి ఉచితంగా వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. ఆర్ఎంవో సంధ్య, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ శిరీష, అపోలో సూపరింటెండెంట్ రంగనాథ్, ఈఎన్‌టీ వైద్యులు ప్రతాప్, దీన్‌దయాళ్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నాటు తుపాకుల స్వాధీనం


నాటు తుపాకులతో నిందితులు

**యాదమరి, న్యూస్‌టుడే:** షికారీల నుంచి ఆరు నాటు తుపాకులు స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఈశ్వర్ తెలిపారు. కీనాటంపల్లి పంచాయతీ షికారీ కాలనీలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. లైసెన్సు లేకుండా కలిగి ఉన్న ఆరు తుపాకులను కలిగి ఉన్న వసంత్‌రాజ్, చందు, సురేష్, అజిత్, రమేష్‌ను అరెస్టు చేశారు. లైసెన్సు లేకుండా ఎవరైనా తుపాకులు కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన కాణిపాకం విద్యార్థులతో ఉపాధ్యాయులు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి హాకీ, ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. నెల్లూరులో నవంబరు 3వ తేదీ నుంచి జరిగే అండర్-17 హాకీ పోటీలకు బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న జి.నీలిమ, నంద్యాలలో జరిగే ఫెన్సింగ్ పోటీలకు అండర్-17 విభాగంలో యువశ్రీ, అండర్-14 విభాగంలో పి.దేవిప్రియ, డిల్లీబాబు, పి.జాన్ ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు. పీడీలు నాగరాజు, మహారాణి, ఫెన్సింగ్ కోచ్ ఎం.రాఘవ కార్తిక్ ఉన్నారు.

## ప్రసూతి సేవలు మెరుగుపరచండి


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి

**చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసూతి సేవలు మెరుగుపరచి మాతాశిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణ, గర్భిణులు, బాలింతలు, శిశువులకు అందాల్సిన అన్ని సేవలను ప్రణాళిక ప్రకారం అందించాలన్నారు. శిశువులకు వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం అందించాలని, అప్పుడే మరణాలను తగ్గించొచ్చన్నారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచి, భ్రూణహత్యలు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. ఎంసీహెచ్ నోడల్ అధికారిణి జానకీరావు, కీర్తి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఉద్యోగుల సమస్యలు పార్లమెంటరీ కమిటీ కృషి


ఎంపీ ప్రసాదరావును అభినందిస్తున్న నిర్వాహకులు

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** దళిత ఉద్యోగుల సమస్యలను జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ పరిష్కరిస్తుందని కమిటీ సభ్యులు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. కేరళలోని మున్నార్‌లో మూడ్రోజుల పాటు నిర్వహించిన జాతీయ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జాతీయ కమిటీ బాసటగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకునేందుకు సహకరించనున్నట్లు స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసానిచ్చారు.

## వంటగ్యాస్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ దాడులు


స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు చూపుతున్న విజిలెన్స్ అధికారులు

**నగరి, న్యూస్‌టుడే:** గృహ వినియోగ వంటగ్యాస్‌ను అక్రమంగా హోటళ్లలో వినియోగించడంపై తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం నగరి పట్టణంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. నగరి-తిరుత్తణి రోడ్డులో ఆర్ఆర్ బిరియానీ సెంటర్, మాషా అల్లా బిరియానీ సెంటర్, హనీఫా హోటల్, దర్శన్ బేకరి, జబ్బార్ హోటల్, విరాట్ టీ స్టాల్‌లలో తనిఖీ చేసి, ఆరు సిలిండర్లు సీజ్ చేశారు. గృహవినియోగ గ్యాస్‌ను అక్రమంగా వినియోగించిన ఆయా హోటళ్ల యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, డీటీ మేఘవర్ణం, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు


**రొంపిచెర్ల (కల్లూరు):** మహిళపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కల్లూరు సీఐ సూర్యనారాయణ తెలిపారు. రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లెకు చెందిన రోజా నాలుగు రోజుల కిందట పొలం వద్ద పాడిఆవులు మేపుతుండగా, అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ వచ్చారు. ఆమెకు అతను సమీప బంధువు కావడంతో మూడు నెలలుగా పనులకు ఎందుకు పోవడం లేదని ప్రశ్నించింది. దీన్ని అవమానంగా భావించిన ప్రవీణ్‌కుమార్ మహిళపై బీరు సీసాలతో దాడి చేసి గాయపరిచాడు. కాళ్లు, చేతులు, గొంతు మీద కోశాడు. తీవ్ర గాయాలతో ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చి ఆమెను రక్షించి వైద్యశాలకు తరలించారు. బాధితురాలు ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పీలేరు కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండు విధించారు. ఏఎస్సై మధు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాల దొంగల ముఠా అరెస్టు

### రూ. 12 లక్షల వాహనాలు స్వాధీనం

**శాంతిపురం, న్యూస్‌టుడే:** మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి.. వారి నుంచి రూ. 12 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్సైలు ఐ.నరేష్, శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ కదిరిఓబనపల్లెకు చెందిన మధు, నవీన్, నందీష్ ద్విచక్రవాహనాలపై కుప్పం- కేజీఎఫ్ మార్గంలో గురువారం వెళుతుండగా.. అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా.. బైకులు చోరీ చేసినట్లు తేలిందన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రెండు లారీలు ఢీ.. స్వల్పగాయాలతో బయటపడ్డ డ్రైవర్లు


ఢీకొన్న లారీలు

**నింద్ర, న్యూస్‌టుడే:** రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డ ఘటన నేటమ్స్ షుగర్స్ కూడలి వద్ద చెన్నై-కడప జాతీయ రహదారిలో శుక్రవారం చోటుచేసుకుంది. మధ్యాహ్నం జోరువాన కురుస్తున్న సమయంలో కర్ణాటక నుంచి చెన్నై వెళ్తున్న లారీ డ్రైవర్‌కు రోడ్డుపై ఉన్న గుంతలు తెలియకుండా దిగడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు వచ్చి పునరుద్ధరించారు. ఈ గుంతల కారణంగా పలువురు ద్విచక్ర వాహనదారులు ఇటీవల ప్రమాదానికి గురయ్యారని స్థానికులు తెలిపారు.

## పిడుగుపాటుతో విగ్రహానికి పగుళ్లు



**కల్లూరు, న్యూస్‌టుడే:** దేవళంపేట గ్రామ పరిసరాల్లో గురువారం రాత్రి పిడుగు పడింది. ఆ ప్రభావంతో దేవళంపేటలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంపైన దక్షిణామూర్తి విగ్రహానికి పగుళ్లు ఏర్పడి పెచ్చులూడి పడ్డాయి. శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరచి నిత్య పూజలకు సిద్ధం చేస్తూ ఆలయ అర్చకులు ప్రకాష్ గమనించగా దక్షిణామూర్తి విగ్రహానికి పగుళ్ల ఉన్న విషయాన్ని గుర్తించారు.



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

## దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** విజయవాడలోని ఇంద్రకీలాద్రిలో వెలసిన శ్రీ కనకదుర్గమ్మను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

**ఆకస్మిక తనిఖీ.. బంగారుపాళ్యం:** స్థానిక ఏపీవీవీపీ ఆస్పత్రిలోని క్షయవ్యాధి యూనిట్‌ను అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచితంగా మందులు ఇస్తున్న విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. వైద్యాధికారిణి శిరీష, టీబీ పర్యవేక్షణాధికారి శివకుమార్, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

**న్యూస్‌టుడే, చిత్తూరు నగరం**

**సమస్య:** కొంగారెడ్డిపల్లి సత్యనారాయణపురంలో తమ ఇళ్ల స్థలాల ఎదురుగా రెవెన్యూ అధికారులు ఇతరులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో సమస్యగా మారింది.

**-స్థానికులు**

**సమాధానం:** క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

**-రామకృష్ణుడు, ఏసీపీ, నగరపాలక సంస్థ**

**న్యూస్‌టుడే, తవణంపల్లె**

**సమస్య:** సీసీరోడ్డును ఎత్తుపల్లాలుగా నిర్మించడంతో వర్షపునీరు రోడ్డుపై నిలుస్తోంది. కాలువలు లేక మురుగునీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తున్నారు.

**-బాబునాయుడు, దిగువమాఘం**

**సమాధానం:** నిధులు మంజూరు కాగానే రోడ్డు బాగుచేయిస్తాం. కాలువలు నిర్మిస్తాం.

**- మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శి, దిగువమాఘం**

**న్యూస్‌టుడే, తవణంపల్లె**

**సమస్య:** రాయితీ వేరుసెనగ విత్తనాలను భూ విస్తీర్ణం బట్టి కాకుండా అందరికీ ఒకేలా అందించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మూడెకాల రైతుకు ఒకే బస్తా ఇవ్వడంతో విత్తనాలు చాలడం లేదు.

**- బాబునాయుడు, రైతు, దిగువమాఘం**

**సమాధానం:** రాయితీ వేరుసెనగ విత్తన కాయలను విస్తీర్ణం బట్టి అందించే విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

**- ప్రవీణ్, ఏవో, తవణంపల్లె**

**న్యూస్‌టుడే, వడమాలపేట**

**సమస్య:** వడమాలపేట నుంచి కాయంపేట మీదుగా తిరుపతికి వెళ్లే రోడ్డు గుంతల పడి అధ్వానంగా ఉంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

**-రాజ్‌గోపాల్‌శెట్టి, ఉపాధ్యాయులు, కాయం గ్రామం.**

**సమాధానం:** గుంతలు త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. **-అమర్‌నాథ్, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, పుత్తూరు**

## పోలీసులకు చట్టాలు, విధులపై అవగాహన అవసరం: ఎస్పీ



కేసుల్లో ఉన్న ద్విచక్ర వాహనాలు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

**పాలసముద్రం, న్యూస్‌టుడే:** పోలీసులు ప్రధానంగా విధులు, చట్టాలపై అవగాహన కలిగిఉంటే చక్కగా రాణించగలరని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో అక్రమాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఉంచుకోవాలని, అప్పుడే నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి సులువవుతుందన్నారు. సరిహద్దుల్లో ఇసుక అక్రమాలు జరగకుండా అరికట్టాలన్నారు. మహిళా పోలీసులు గ్రామాల్లో నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇసుక అక్రమ తరలింపులో పట్టుకున్న టిప్పర్ సహా జేసీబీని సీజ్ చేయాలని ఆదేశించారు. క్రైమ్ రికార్డులు పరిశీలించారు. ఏఎస్ఐ లక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

## అవినీతికి అడ్డే లేదాయె..!

- ప్రతి పనికీ మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే
- ప్రజారోగ్య విభాగంలో వసూళ్ల పర్వం



కంపోస్ట్ యార్డులో చెత్త వేర్వేరు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



నగరపాలక కార్యాలయం

**న్యూస్‌టుడే, చిత్తూరు నగరం**

చిత్తూరు నగరపాలక ప్రజారోగ్య విభాగం పనితీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది.. తొలి నుంచి అక్రమాలకు నిలయంగా మారిన ఈ విభాగంలో మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, ఉన్నతాధికారుల వరకు.. పారిశుద్ధ్య పనులకు సంబంధించి ప్రతి అంశాన్ని ఆదాయ వనరులుగా మార్చుకున్నారు.. ఇలా అక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.. వీరి అక్రమ వసూళ్లపై ప్రశ్నించే నాథుడే కరవయ్యాడు.

నగరపాలక సంస్థలో 197 మంది శాశ్వత పద్ధతిపై పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. కొందరు డిప్యూటేషన్లలో వివిధ విభాగాల్లో ఉండగా మరికొందరు సక్రమంగా విధులకు హాజరు కావడంలేదు. 30 మంది విధులకు పూర్తిగా రావడం లేదు. వీరి నుంచి ప్రజారోగ్య మేస్త్రీలు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు నెలవారీ మామూళ్లు తీసుకుని హాజరు వేసేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య పనులు చేయకుండానే కొందరు కార్మికులు వీరి సహకారంతో జీతాలు పొందుతున్నారు. ఇందుకు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు నెలకు రూ.15 వేలు ముడుతోంది. మరోవైపు నగరంలో ప్లాస్టిక్ దుకాణాల నుంచి, కంపోస్టుయార్డులో పందుల పెంపకందారుల నుంచి మామూళు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు పరిశ్రమల నుంచి అనధికారికంగా వారానికి 5 నుంచి 6 టన్నుల చెత్త, వ్యర్థాలు కంపోస్టుయార్డుకు తరలిస్తూ వారికి రసీదులు ఇవ్వకుండా రూ. వేలల్లో అక్రమంగా వసూలు చేస్తున్నారు. పొన్నియమ్మన్ ఆలయ వీధిలో పెద్ద ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల దుకాణాల నుంచి వసూళ్లకు పాల్పడు తున్నారు. సుబేదార్ వీధి, సుందరయ్యర్ వీధి, పలమనేరురోడ్డు, ఎంజీఆర్ వీధుల్లోని దుకాణాల నుంచి వసూళ్లు ఎక్కువయ్యాయి. ప్లాస్టిక్ నిషేధ చట్టం ప్రకారం దుకాణాల్లోని ప్లాస్టిక్ నిల్వలకు జరిమానా విధించకుండా అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. పారిశుద్ధ్య మేస్త్రీలు, పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శుల్ని వసూళ్ల ఏజెంట్లుగా మార్చుకుని ప్రజారోగ్య విభాగం అధికారులు దందా సాగిస్తున్నారు.

### ధ్రువీకరణపత్రాల జారీకి మామూళ్లు

ప్రజారోగ్య విభాగంలో కీలకమైన జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీలో అక్రమ వసూళ్ల పర్వం కొనసాగుతోంది. మరణ, జనన, వివాహ, అంత్యక్రియలు, ఎన్‌ఏసీ ధ్రువీకరణ పత్రాల జారీకి దరఖాస్తుదారులు మామూళ్లు ఇచ్చుకోవలసిందే. లేకుంటే ఏదో ఒక కొర్రీ పెట్టి సకాలంలో ధ్రువీకరణపత్రాలు ఇవ్వకుండా దరఖాస్తుదారుల్ని కార్యాలయం చుట్టూ తిప్పుకొంటారు. ఈ ఐదు రకాల పత్రాలు కీలకం కావడంతో ఎందుకొచ్చిన తంటా అని ప్రజలు ముడుపులు ఇస్తున్నారు. ఈ విభాగానికి సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో అసిస్టెంట్ స్టాటిటికల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అదనంగా పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడంతో మధ్యాహ్నం ప్రతి రోజు 2.30గంటల నుంచి 5.30 వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండరు. ఈ సమయాల్లో ధ్రువీకరణపత్రాలకు వచ్చే దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. ఆయా పత్రాల జారీలోనూ తీవ్ర కాలయాపన చోటుచేసుకుంటోంది. అనుభవం లేని వ్యక్తుల్ని సంబంధం లేని పోస్టులకు బాధ్యులుగా చేయడంతో.. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### విచారణ చేస్తాం

విధులకు హాజరుకాని కార్మికులకు హాజరు వేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ చేపడతాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

**-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

## పాత కలెక్టరేట్‌లోకి విద్యుత్తు శాఖ రూరల్ డివిజన్



పాత కలెక్టరేట్‌లో భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్, ఇంజినీర్లు

**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖ చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ కార్యాలయాన్ని గిరింపేట పాత కలెక్టరేట్ ప్రాంగణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం విద్యుత్తుశాఖ తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్.. పాత కలెక్టర్‌లోని కలెక్టర్ భవనాన్ని పరిశీలించారు. భవన పరిస్థితి, దాన్ని పునరుద్ధరించేందుకు ఎంత ఖర్చవుతుంది తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ అనుమతితో రూరల్ డివిజన్ కార్యాలయం ఇక్కడ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని ఎస్‌ఈలు తెలిపారు. వారివెంట ఈఈలు మునిచంద్ర, అమరబాబు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీ పూడ్చివేత

మండల పరిధి మకరపట్టు వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా రక్షిత మంచినీరు వృథాగా పోతుండటంపై ఈ నెల 15న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి చంద్ర స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బందిచే పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టారు. **-న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు**

స్పందనకు స్పందనం

## సృజనతో విద్యార్థులు రాణించాలి



ప్రతిభా పాటవ పోటీలో విజేతలు

**చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని తమలో దాగిఉన్న సృజనాత్మకత వెలికితీసి రాణించాలని విజయం విద్యాసంస్థల ఛైర్మన్ తేజోమూర్తి కోరారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని విజయం సీనియర్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్ష శుక్రవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాశారు. విద్యార్థులు పోటాపోటీగా పరీక్ష రాయగా న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు. ప్రేమశ్రీ, ఖాదర్ ఇన్ సుహానాఖాన్, దేవకీరత్నం వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరికి విద్యాసంస్థల ఛైర్మన్ తేజోమూర్తి, ఈడీ శైలజామూర్తి ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని కౌసల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరిలో పోటీతత్వం అలవడాలి




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కుమారవేలు

**పుత్తూరు, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రాచపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారవేలు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని అలవాటు చేయడానికి 'ఈనాడు' ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థులు సైతం ఇలాంటి పోటీ కార్యక్రమాల్లో పాల్గొని తమ సత్తా నిరూపించుకోవాలన్నారు. నేడు విద్యార్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉందన్నారు. వ్యాసరచన పోటీలో చరిష్మా, చరణి, అమృత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు కుమారవేలు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటకృష్ణరావు, నరేంద్ర పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** విద్యుత్తుశాఖ చిత్తూరు అర్బన్ ఆపరేషన్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మత్తు కారణంగా శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నామని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డివిజన్ పరిధిలోని దొడ్డిపల్లి, గుడిపాల మండలంలోని పానాటూరు, పాపసముద్రం, 197. రామాపురం గ్రామాలతో పాటు పూతలపట్టు, పాలసముద్రం మండలాల్లో సరఫరా పూర్తిగా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కన్నెత్తి చూడని ఆర్‌అండ్‌బీ.. సర్పంచి చొరవ




వాయుగుండం ప్రభావంతో చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారి రోడ్డులో గుంతలు ఏర్పడి పొలం గట్లులా మారి అధ్వానంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యపై ఈ నెల తొమ్మిదో తేదీన 'ఈనాడు'లో 'చెరువు కాదు...రోడ్డే..!' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీన్ని మరమ్మతు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ పట్టించుకోక పోవడంతో శ్రీకావేరిరాజుపురం సర్పంచి గాలి మహేష్‌బాబు స్పందించి తమ సొంత నిధులతో జేసీబీ సహాయంతో ప్రధాన రహదారిలోని గుంతలు పూడ్పించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

## డ్రై-డే పాటించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి

**చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే:** ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై-డే డ్రై-డే కార్యక్రమాన్ని పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి తెలిపారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీకే కాలనీ ప్రాంతంలో శుక్రవారం డ్రై-డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వారాల తరబడి నీరు నిల్వ ఉండరాదని, అలా ఉంటే దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడాల్సి వస్తుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సబ్-యూనిట్ అధికారి రామకృష్ణ, ఏఎన్ఎం రేవతి, తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తుల వారి జీవన ప్రమాణాల మెరుగుకు కృషి



నాయకులతో సమావేశమైన ఈడీ శ్రీదేవి

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** కులవృత్తుల వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ భవనంలోని సమావేశ మందిరంలో సంచార జాతులు, కులవృత్తుల సంఘం నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన ప్రమాణాలు మరింత వృద్ధి చెందాలంటే చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు స్వీకరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వరసిద్ధుడి ఆలయ డార్మిటరీకి చాపల విరాళం



చాపలు అందజేస్తున్న రఘురామయ్య, రమేష్‌బాబు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ విశ్రాంతి భవనానికి 150 చాపలను కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు చెందిన దాతలు రఘురామయ్య, రమేష్‌బాబు ఆలయ ఈవో పి.గురుప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు ఉన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం



వైద్యులు, సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ సభ్యులు

**యాదమరి, న్యూస్‌టుడే:** టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు జార్జ్, రామ్మోహన్ మండలంలోని 184 గొల్లపల్లి, పత్రపల్లి సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం మాదిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** అంగవైకల్యం శరీరానికే తప్ప మనసుకు కాదని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై శుక్రవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రత్యేక ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సేవల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమగ్ర అక్ష అదనపు సంచాలకులు వెంకటరమణారెడ్డి, జిల్లా సహిత విద్య సమన్వయకర్త నరోత్తమరెడ్డి, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు హేమలత, పోలయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు. గుడిపాల, నింద్ర, నగరి, జీడీనెల్లూరు, బంగారుపాళ్యం, యాదమరిలోనూ కార్యక్రమాలు నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి




కార్వేటినగరం: సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న తెదేపా, జనసేన పార్టీ నాయకులు

**పెనుమూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పరుగులు పెడుతోందని తెదేపా మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రుద్రయ్యనాయుడు అన్నారు. బి.అగ్రహారంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సీసీరోడ్డుకు ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. గుడ్యాణంపల్లె గ్రామంలో జరిగిన భూమిపూజలో ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి పాల్గొన్నారు. సామిరెడ్డిపల్లె, తాటిమాకులపల్లె, కలికిరి, గుంటిపల్లె, తదితర పంచాయతీల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.కార్వేటినగరం: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు పొన్నా యుగంధర్ అన్నారు. ఆర్‌కేవీబీపేట, ఎంఎంవిలాసం, కేపీ అగ్రహారం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్రాయులుయాదవ్, తెలుగు రైతు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరాజు, నాయకులు చంద్రమౌళిరెడ్డి, రాము, హేమంత్‌రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.




నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

## విద్యుత్తు ఛార్జీలు పెంచొద్దు

**పుత్తూరు, న్యూస్‌టుడే:** ఇంధన సర్దుబాటు పేరిట విద్యుత్తు ఛార్జీలు పెంచొద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. ఏడీఈ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలపై బాదుడే బాదుడని విమర్శించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రూ.8,114 కోట్లు ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తు ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. నాయకులు విజయ్, శివ, రమేష్, నరసింహులు, మహేష్ పాల్గొన్నారు.

## బహిరంగంగా మద్యం తాగిన వారికి జరిమానా

**నగరి, న్యూస్‌టుడే:** బహిరంగంగా మద్యం తాగిన, ఆపై వాహనాలు నడిపిన వారికి నగరి కోర్టు ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ శుక్రవారం జరిమానా విధించారని సీఐ మహేశ్వర్ తెలిపారు. పట్టణంలో గత వారం రోజుల్లో 17 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున రూ.17 వేలు జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు జరిమానా విధించారన్నారు.

**పరామర్శ.. వడమాలపేట:** ప్రమాదవశాత్తూ గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న వైకాపా మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డిని శుక్రవారం పత్తిపుత్తూరులో మాజీ మంత్రి రోజా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సురేష్‌రాజు, నందయ్య, మదన్‌మోహన్ రెడ్డి, నిరంజన్, వెంకటరెడ్డి, బాల పాల్గొన్నారు.

## తెదేపా సీనియర్ నాయకుడు వెంకటముని మృతి

**కార్వేటినగరం, న్యూస్‌టుడే:** గొల్లకండ్రిగకి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు వెంకటముని(75) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎంపీపీ జనార్దన్‌రాజు, తెదేపా మండల అధ్యక్షుడు చెంగల్యాయులుయాదవ్, తెలుగు రైతు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరాజు, నాయకులు సోమశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.

## పరవళ్లు తొక్కుతున్న గార్గేయ నది



చిత్తూరు-ఐరాల ప్రధాన రహదారిలో ఉన్న గార్గేయ నది పరవళ్లు తొక్కుతోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడుగా గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా గార్గేయ నది ప్రవాహం ప్రారంభమైంది. పెద్ద ఎత్తున నీటి ప్రవాహం రావడంతో తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న లోవంతెనపై అధికారులు రాకపోకలను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం వాహనాలను కొంత సమయం అనుమతించలేదు. నీటి ప్రవాహం తగ్గిన తరవాత అనుమతించారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్సై నరసింహులు సిబ్బందితో పర్యవేక్షించారు. **-ఐరాల, న్యూస్‌టుడే**

## టపాసుల దుకాణాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** దీపావళి పండుగ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల నిర్వహణ, భద్రతపై దుకాణదారులు, అధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో టపాకాయల దుకాణ నిర్వహణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. అగ్నిమాపక, మండల రెవెన్యూ శాఖల అధికారులు లైసెన్సుల మంజూరులో నిబంధనలు పాటించాలన్నారు. అంతకు ముందు దుకాణాల ఏర్పాటు నిమిత్తం కట్టమంచి మామిడికాయల యార్డు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానాల్ని పరిశీలించారు. డీఎస్పీ సాయినాథ్, జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, తాలుకా సీఐ శ్రీనివాసరావు, రెండో పట్టణ ఎస్సై ప్రసాద్, తహసీల్దారు కళావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

## అర్బన్ డివిజన్ నూతన భవన నిర్మాణానికి ప్రణాళిక



శిథిలావస్థలో ఉన్న ఈఆర్‌వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు

**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖ చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలోని భవనాలన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, ఈ ప్రాంగణంలోనే ఒకే సముదాయంలో కార్యాలయాల నిర్మాణానికి వీలైనంత త్వరగా చర్యలు చేపట్టనున్నామని విద్యుత్తుశాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆయన తిరుపతి జిల్లా ఎస్‌ఈ సురేంద్రనాయుడితో కలిసి శుక్రవారం గాంధీరోడ్డులోని అర్బన్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలోని ఈఈ, డీఈఈ, ఈఆర్‌వో కార్యాలయాలు పరిశీలించారు. ఈ కార్యాలయం బాగా ఉరుస్తుండటంతో తాత్కాలికంగా కార్యాలయం మార్పునకు చర్యలు చేపట్టాలని ఈఈ మునిచంద్రను ఆదేశించారు. వీలైనంత త్వరగా నూతన కార్యాలయ భవనాల సముదాయ నిర్మాణాలకు సివిల్ విభాగ ఇంజినీర్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ తెలిపారు. వినియోగదారులు, అధికారులు, సిబ్బంది సౌకర్యార్థం అధునాతన విధానంలో కార్యాలయ భవన సముదాయన్ని నిర్మించనున్నామని తెలిపారు. ఈఈ మునిచంద్ర, కన్‌స్ట్రక్షన్ ఈఈ అమరబాబు, డీఈఈలు శేషాద్రిరెడ్డి, ఆనంద్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడవి పందుల దాడిలో వరి పంటకు నష్టం

**ఐరాల, న్యూస్‌టుడే:** నాగంవాంపల్లెలో రైతు కృష్ణమూర్తికి చెందిన సుమారు రెండు ఎకరాల వరి పంటను గురువారం రాత్రి అడవి పందులు నాశనం చేశాయి. పంట చేతికి అందే సమయంలో అడవి పందుల దాడితో నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని రైతు విజ్ఞప్తి చేశారు.

## టిప్పర్ స్వాధీనం: నలుగురిపై కేసు

**పాలసముద్రం, న్యూస్‌టుడే:** సింహరాజుపురం పంచాయతీ పరిధిలోని అక్రమంగా ఉంచిన ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేస్తున్నారనే సమాచారంతో దాడి చేసి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై భారతి తెలిపారు. అక్రమానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

## పొట్టేళ్ల చోరీ

**బంగారుపాళ్యం:** మిట్టపల్లెలో గురువారం రాత్రి రూ.లక్ష విలువైన పొట్టేళ్లు, మేకలు చోరీకి గురయ్యాయి. నాగరాజుకు ఇంటిముందు కట్టి ఉంచి ఐదు పొట్టేళ్లు, నాలుగు మేకపోతులను దొంగలు చోరీ చేశారు. ఉదయం నిద్రలేచి చూడగా చూస్తే అవి కనిపించలేదని బాధితుడు ఫిర్యాదు చేశాడని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

## లాటరీ విక్రేత అరెస్టు

**చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే:** చిత్తూరులోని సామిరెడ్డివీధిలో లాటరీ టికెట్ల విక్రయాలపై చిత్తూరు రెండో పట్టణ పోలీసులు దాడి చేసి లాటరీ స్లిప్పులు, రూ.18,370 నగదు స్వాధీనం చేసుకున్నారు. లాటరీ విక్రయిస్తున్న ఉమామహేష్‌ను అరెస్టు చేశామని సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

**చిత్తూరు (వ్యవసాయం):** జిల్లాలోని గొర్రెలు, మేకల (జీవాలు)కు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించామని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమాన్ని తొలుత తవణంపల్లె మండలం కాణిపాకపట్నంలో ప్రారంభించామన్నారు. జిల్లాలో ఏడు లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని, వాటిలో నులిపురుగుల నివారణకు విధిగా నట్టల నివారణ మందు వేయించాలని చెప్పారు. వివరాలు భారత్ పశుగణన యాప్‌లో నమోదు చేయాలన్నారు.

# పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు



న్యూస్‌టుడే, సోమల

**సమస్య:** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు వెళ్లే నీరు రావడం లేదు. పుంగనూరు- తిరుపతి మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం నీరు సరఫరా చేయాలి. – స్థానికులు

**సమాధానం:** వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ, సోమల

న్యూస్‌టుడే, చౌడేపల్లె

**సమస్య:** మండలంలోని చిట్రెడ్డిపల్లె నడిబొడ్డున ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. స్తంభాల మధ్య దూరం ఎక్కువ ఉండటంతో తీగలు తగులుకుని నిత్యం నిప్పురవ్వలు రాలుతున్నాయి. మరో స్తంభం ఏర్పాటు చేయాలి. – రెడ్డెప్ప, గ్రామస్థుడు

**సమాధానం:** అక్కడి పరిస్థితి పరిశీలించి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. – శశిధర్, ఏఈ, ట్రాన్స్‌కో

న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

**సమస్య:** కుప్పం కో-ఆపరేటివ్ సొసైటీ టౌన్ బ్యాంకు ఎదుట నెల తరబడి పార్టీల బ్యానర్లు అడ్డంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. గేటు వద్ద ఈ హోర్డింగ్ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – రమణ, కుప్పం

**సమాధానం:** వెంటనే పరిశీలించి బ్యానర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, పుర కమిషనర్

న్యూస్‌టుడే, పలమనేరు

**సమస్య:** పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతి శుక్రవారం ఇబ్బంది పడుతున్నారు. వారపు సంత రోజు దుకాణాలు పాఠశాల ప్రధాన గేటు ఎదుట ఉంచుతున్నారు. దీంతో రాకపోకలకు దారి మూసుకుపోతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – బాబు, పలమనేరు

**సమాధానం:** వెంటనే పరిశీలించి పాఠశాల పురపాలిక సిబ్బందిని పర్యవేక్షకులు నియమిస్తాం. దారికి ఇబ్బంది లేకుండా చూస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, పుర కమిషనర్

## చెత్త, వ్యర్థాల తొలగింపు

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలోని రాగానిపల్లె పంచాయతీ అదవినాధునికుంటలో వీధి కాలువలు, పాఠశాల ఆవరణలో చెత్త దిబ్బలు తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 13న మేమున్నాం.. మీకు తోడుగాలో వచ్చిన వార్తకు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బైరెడ్డిపల్లె-1 సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఉద్యోగులకు సూచనలు చేశారు. కార్యాలయ వేళల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా పనిచేయాలని చెప్పారు. జడ్పీటీసీ సభ్యులు కేశవులు, స్థానిక సర్పంచి వెంకటేష్ పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



పరశురాముడు

**బైరెడ్డిపల్లె:** మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పరశురాముడు అన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై కృష్ణయ్యను జిల్లా అధికారులు రెండు నెలల క్రితం విఆర్‌కు బదిలీ చేశారు. బదిలీల్లో భాగంగా అనంతపురం నుంచి పరశురాముడు ఎస్సైగా ఇక్కడికి బాధ్యతలు స్వీకరించారు.

## కత్తెరపురుగును నివారించండి

**పలమనేరు:** మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు సోకుతోందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వ్యవసాయ అనుబంధశాఖల వారితో రైతులకు శాఖాపరమైన వివరాలను తెలిపారు. వేపనూనె ఉపయోగించాలని సూచించారు. వరిలో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు వెలుపలికి పంపాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అన్నపూర్ణమ్మ తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ విజయశంకర్‌రెడ్డి, ఏవో సంధ్య పాల్గొన్నారు.

## రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాతా సేవాట్రస్టు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు.

# సమాజ హితం.. ఎన్‌సీసీ అభిమతం





శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న అధ్యాపకులు ప్రవీణ్

రక్తదానంలో పలువురు విద్యార్థుల ఆదర్శం – న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ప్రోత్సహించి అండగా నిలుస్తున్న అధ్యాపకులు


అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలబెడుతున్నారు ఆ యువకులు. స్థానిక శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ బీకాం చదువుతూ.. ఎన్‌సీసీలో చేరి సమాజ సేవలో పాల్గొంటున్నారు. కళాశాలలో జరిగే రక్తదాన శిబిరాలు, ప్రాణాపాయ స్థితిలోనూ, ప్రమాదాలు, ప్రసవాలు, అత్యవసర సమయాల్లో తమవంతు సాయంగా ముందుకు వస్తున్నారు. ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశానికి, రక్తమిచ్చి సమాజానికి సేవ చేయడం తమవంతు బాధ్యత గుర్తించామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎన్‌సీసీ అధ్యాపకులు సోమ రాజు, పీడీ రామ్‌కుమార్ ప్రోత్సహిస్తున్నారు.

### దూర ప్రాంతాలకు సైతం వెళ్లి..



అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు నిలబడతాయని రమేష్ బాబు చెబుతున్నారు. పెద్దపంజాణి మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, సుజాతల కుమారుడు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ బీకాం చదువుతున్నాడు. ఎన్‌సీసీలో చేరి తిరుపతి, పుంగనూరులో జరిగిన శిబిరాల్లో రక్తదానం చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు రమేష్ చెబుతున్నారు.

### రక్తమిస్తే సంతృప్తి



పెద్దపంజాణి మండలం అంజిగాని పల్లె గ్రామానికి చెందిన రైతు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమారుడు ఎం.మోహన్. స్థానిక శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ బీకాం చదువుతున్నాడు. ఎన్‌సీసీలో చేరి క్రమశిక్షణతో కూడిన జీవితం అలవర్చుకున్నారు. రెడ్‌క్రాస్, రక్తదాన శిబిరాల్లో రక్తమిస్తున్నారు. రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలోని ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్న సంతృప్తి కలుగుతోందన్నారు. అత్యవసరాల్లో అవసరమైన వారికి 'బీ పాజిటివ్' రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు మోహన్ ప్రకటించారు.

### అధ్యాపకుల వెన్నుదన్ను..



స్నేహితుల ప్రోత్సాహం.. అధ్యాపకుల అండతో రక్తదానం చేయడం అలవర్చుకున్నారు సంతోష్ కుమార్‌రెడ్డి. పుంగనూరు మండలం ఏటవాకిలి గ్రామానికి చెందిన సాయిరెడ్డి, శివరాణి దంపతుల కుమారుడు. ఎన్‌సీసీలో దయగుణం అలవడిందన్నారు. ప్రాణాపాయ స్థితిలో రక్తం ప్రాధాన్యం అధ్యాపకులు వివరించడంతో సిద్ధమైనట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో అవసరమైన వారికి రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నాడు సంతోష్‌కుమార్‌రెడ్డి.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం..

**పలమనేరు:** పలమనేరు విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలో శనివారం సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్తు డీఈఈ చిన్నబ్బ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, గంగవరం మండలాల్లో అంతరాయం ఉంటుందని సహకరించాలని ప్రకటనలో కోరారు. ● **కుప్పం పట్టణం:** కుప్పంలోని 132/33కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కుప్పం, గుడుపల్లె మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎండీ సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## వైకల్యాలు సరిదిద్దడానికే శిక్షణ

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో అభ్యసనలో ఎదుర్కొనే వైకల్యాలు సరిదిద్దడానికే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భవిత కేంద్రాల శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. **పుంగనూరు గ్రామీణ:** చదువులో వెనుకబడిన ప్రత్యేక ప్రతిభావంతులకు ఐదు రకాల అభ్యాసన వైకల్యాలు ఉంటాయని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-2 రెడ్డెప్పశెట్టి, హెచ్ఎం సుబ్రమణ్యం, ఐఈ ఆర్పీ రాధిక పాల్గొన్నారు. **బైరెడ్డిపల్లె:** ప్రత్యేక ప్రతిభావంతుల ఆరోగ్యం, ఆర్యున్నతి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవ సందర్భంగా శుక్రవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్వాహకులు నిర్మలకుమారి, సుభాషిణి, ఎస్‌వో సురేష్‌బాబు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**పెద్దపంజాణి:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో మంజూరైన సిమెంటురోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు.



## పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ

**శాంతిపురం, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ అభివృద్ధి పనులతో గ్రామాలకు మహర్దశ రానుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. రాళ్లబూదుగూరు, నడింపల్లె, చిన్నారిదొడ్డి, సి.బండపల్లె, 64- పెద్దూరు పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శుక్రవారం భూమి పూజలు చేశారు. మినీ గోకులాల లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీ పత్రాలను అందజేశారు. ● **చీకటిపల్లె(గుడుపల్లె):** మండలంలో చీకటిపల్లెలో 'పల్లె పండుగ' కార్యక్రమం స్థానిక సర్పంచి నారాయణప్ప ఆధ్వర్యంలో జరిగింది. సీసీ రోడ్లు, గోకుల షెడ్లు, ప్రజారోగ్య సేవా కేంద్ర భవనాన్ని పీఎస్ మునిరత్నం ప్రారంభించారు. ● **సోడిగానిపల్లె(గుడుపల్లె):** మండలం, పంచాయతీ తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి కుప్పం తెదేపా సమన్వయ కమిటీ కన్వీనర్ పీఎస్ మునిరత్నం, ఆయన సతీమణి...



మినీ గోకులం షెడ్డు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం

నర్ ఆర్.చంద్రశేఖర్ ఎన్టీఆర్ సుజల ప్రవంతి రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు.

## తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం

**శాంతిపురం, న్యూస్‌టుడే:** తల్లీబిడ్డల సంక్షేమమే అంగన్‌వాడీలకు ప్రధానమని, అందుకు సిబ్బంది కృషి చేయాలని కడ పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మండల పరిధి బడుగుమాకులపల్లె, పోదూరు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. సీడీపీవో కల్పన, ఎంఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న కడ పీడీ వికాస్ మర్మత్





ప్రతిభా పాటవ పరీక్షకు హాజరైన విద్యార్థులు ● బహుమతులు అందుకున్న విద్యార్థులు

## ప్రతిభ చూపి.. బహుమతులు గెలిచి

పట్టణంలోని ఒఎల్ఎల్ పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ప్రతిభా పాటవ పరీక్ష జరిగింది. శుక్రవారం 8,9,10 తరగతుల విద్యార్థులకు పరీక్షలు హాజరయ్యారు. ఇంటర్నెట్ వినియోగం, సామాజిక మాధ్యమాల అంశాలపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. ఇందులో 10వ తరగతి చదువుతున్న ఎస్.గౌస్, ద్వితీయ బహుమతి మనస్విని, తృతీయ బహుమతి నయోమ అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. – న్యూస్‌టుడే, పలమనేరు





పుంగనూరు– రామసముద్రం మార్గంలోని హనుమంతరాయదిన్నె వద్ద గోతులు ● పట్టణంలోని బీడీ కాలనీ వద్ద దెబ్బతిన్న రోడ్డు

## రహదారులు గుల్ల..గుల్ల

**పుంగనూరు, న్యూస్‌టుడే:** మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకే రహదారులు ధ్వంసమయ్యాయి. గ్రామీణ, పట్టణ పరిధిలోని పలు రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. ఏళ్ల తరబడి శాశ్వత మరమ్మతులు చేయకపోవడం, వాహనాల రద్దీ పరిధిదాటి ప్రధాన రోడ్డు సైతం దుస్థితికి చేరుకున్నాయి. స్థానిక హనుమంతరాయదిన్నె, బీడీ కాలనీ, మల్లారమ్మ గుడివీధి, నారప్ప కాలనీలో గుంతలమై రాకపోకలు కష్టం మారింది. వీధులు, గృహాల మధ్య మురుగు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

**రామకుప్పం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కుప్పం డీఎల్‌పీవో రాథాకృష్ణ శుక్రవారం సచివాలయంలో విచారణ చేపట్టారు. సర్పంచి రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి నిధులు దుర్వినియోగం చేసినట్లు గ్రామస్థులు కలెక్టరు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పనులు చేపట్టకుండా తప్పుడు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేస్తున్నారని అందులో వివరించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ప్రజల సమక్షంలో విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో రాథాకృష్ణ మాట్లాడుతూ.. నివేదిక మండల, జిల్లా స్థాయి అధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో రాథాకృష్ణ

## ఎంఈవోలపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

**పెద్దపంజాణి:** మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పాఠశాల సమస్యల గురించి వివరించినా పట్టించుకోకుండా విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంఈటీసీ సభ్యులు సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి, సర్పంచులు భాస్కర్, చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సంపుల్లె ప్రాథమిక పాఠశాల తిరిగి ప్రారంభించాలని కోరినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.



ఎంఈవోలను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు సుబ్రహ్మణ్యం

● ఏరియా ఆస్పత్రిలో నేత్ర శస్త్ర చికిత్సలు..

**పుంగనూరు:** ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా కంటి రోగులు నిర్వహించిన శస్త్ర చికిత్సలు అవసరమైతే చేయడం జరుగుతోందని కంటివైద్య నిపుణురాలు డా.గిరీష్మ బిందు తెలిపారు. శుక్రవారం నాటికి 22 శస్త్రచికిత్సలు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సమావేశానికి హాజరైన అధికారులతో ఆర్డీవో

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

**పలమనేరు, న్యూస్‌టుడే:** స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ నేరమని పలమనేరు ఆర్డీవో శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్యశాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష ఉంటుందన్నారు. ఆయనతో పాటు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, వైద్యులు మల్లికార్జున, శారద పాల్గొన్నారు.

## న్యాయం చేయండి సారూ

**చౌడేపల్లె:** ఏళ్లుగా సాగుచేస్తున్నాం.. మా భూములపై మాకు హక్కు కల్పించి న్యాయం చేయండి సారూ అంటూ మండలంలోని పెద్దకొండామర్రికి చెందిన వెనుకబడిన తరగతులకు చెందిన 20 కుటుంబాలు శుక్రవారం తహసీల్దారుకు మొరపెట్టుకున్నారు. స్పందించిన తహసీల్దారు హనుమంతు విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## యాంత్రిక సేద్యానికి రాయితీలు

**బైరెడ్డిపల్లె:** ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలనే సంకల్పంతో రైతులకు యాంత్రిక సేద్యానికి ప్రభుత్వం రాయితీ సదుపాయం కల్పిస్తున్నట్లు ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. వెంగవారిపల్లె, కడపనత్తం గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఏవో గీతాకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

■ **మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..** కంచిబందార్లపల్లె(గుడుపల్లె): కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండల పరిధి కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన మర్రియప్ప సరిహద్దు ప్రాంతంలోని ఓ మద్యం దుకాణం నుంచి 45 బీరు పాకెట్లు తీసుకొచ్చి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

■ **గృహోపకరణాలు దగ్ధం..** సోమల: మండలంలోని నంజంపేటలో గురువారం రాత్రి ఉరుములతో కూడిన కుండపోత కురిసింది. పిడుగుపాటుకు గ్రామంలోని పలు గృహాల్లో గృహోపకరణాలు కాలిపోయాయి.

■ **బాలికను వంచించిన యువకుడు..!..** కుప్పం: శాంతిపురం మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలిక(19)ను ఓ యువకుడు వంచించి గర్భవతిని చేసినట్లు తన శుక్రవారం వెలుగు చూసింది. దీనిపై బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. కొందరు పెద్దలు రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

■ **మారెమ్మ ఆలయంలో చోరీ..** పలమనేరు: మండలంలోని ముసలిమడుగు మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి హుండీని పగులకొట్టి అందులోని నగదు తీసుకెళ్లారు. అమ్మవారి బంగారు మంగళసూత్రాలు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.లక్ష విలువ చేసే నగలు, ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ **నరసింహస్వామి ఆలయంలో..** చౌడేపల్లె: మండలంలోని కాటిపేరి పంచాయతీ వడ్డివారిపల్లెకు సమీపంలో ఉన్న కదిరి నరసింహస్వామి ఆలయ హుండీ చోరీ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఆలయ తలుపులు తీసి హుండీ పగులగొట్టి అందులోని రూ. 20 వేలు నగదు చోరీ చేశారు. గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

■ **ఆవులు..** పలమనేరు: మండలంలోని కృష్ణాపురంలో రెండు ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గురువారం రాత్రి ఒక వాహనంలో వచ్చి కృష్ణమనాయుడు పొలం వద్ద కట్టేసిన మూగజీవాలను తరలించినట్లు బాధితుడు వాపోయారు. వాటి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ **ఒకరికి పాముకాటు..** పుంగనూరు గ్రామీణ: చౌడేపల్లె మండలం అమినిగుంట గ్రామానికి చెందిన చిన్న వెంకటరమణ కుమారుడు భాస్కర్ (34) పొలంలో పనిచేస్తుండగా శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. కరిచిన వెంటనే పామును గుర్తించి చంపేశాడు. కుటుంబసభ్యులు బాధితుణ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

■ **ఆస్తి కోసం తండ్రిపై కుమారుల దాడి..** పుంగనూరు గ్రామీణ: ఆస్తి పంపకాల్లో తేడాలు రావడంతో తండ్రిపై కుమారులు దాడి చేసిన ఘటన మండలంలోని సింగిరిగుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శేఖర్, చంద్రకళ దంపతులకు ఇద్దరు కుమారులు సునీల్, సూర్య ఉన్నారు. శేఖర్, తల్లి కృష్ణమ్మ దగ్గర ఉంటున్నారు. ఆయన భార్య ఇద్దరు కుమారులతో కలిసి మరో చోట ఉంటున్నారు. నానమ్మ ఆస్తిలో భాగం, రేషన్ బియ్యం తమకే ఇవ్వాలని ఇద్దరు కొడుకులు తండ్రిపై దాడి చేసి గాయపరిచారు. గతంలోనూ పలుమార్లు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

■ **తెదేపా నాయకుడి హఠాన్మరణం..** పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు దామోదరం (60) శుక్రవారం హఠాన్మరణం చెందారు. తెదేపాలో కార్యకర్త నుంచి నాయకుడి వరకు ఎదిగిన ఆయన మృతి చెందడం పట్ల మండల తెదేపా అధ్యక్షుడు మాదవరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భౌతికకాయానికి నివాళి అర్పించారు.

## ఏనుగుల దాడిలో పంట పొలాలు ధ్వంసం

**కల్లూరు:** ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున చల్లావారిపల్లె వ్యవసాయ పొలాల్లో టమాటా, వంకాయ పంటను తొక్కి నాశనం చేశాయి. పాతపేటలో వరిని తొక్కి నాశనం చేశాయి. చిత్తూరు ఇన్‌చార్జి వరి, టమాటా పంటలను ధ్వంసం చేశాయి. మామిడి చెట్ల కొమ్మలు విరిచేసి నట్లు స్థానిక బీటీవో శ్రీదేవి తెలిపారు.



ధ్వంసమైన టమాట పంట | పరిని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు